క్లుప్తంగా

కామాక్షితాయి సేవలో జ్వాలాపురం



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలోని మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ ప్రభుత్వ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్ బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణం పూర్తి



కోవూరు: మండలంలోని వేగూరులో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు నుంచి శివాలయం వరకు డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ ప్రాంతంలో డ్రైనేజీ సౌకర్యం లేక గత కొన్నేళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా వేగూరులో పర్యటించిన ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి స్థానికులు మురుగు సమస్యను తీసుకెళ్లి డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. స్పందించిన ఆయన సచివాలయ నిధులు, పంచాయతీ నిధులతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఎట్టకేలకు డ్రైనేజీ నిర్మాణం పూర్తి కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డిపాజిట్ పేరిట మోసం

నెల్లూరు సిటీ: డిపాజిట్ పేరిట ఓ విశ్రాంత అధ్యాపకుడి నుంచి రూ.పది లక్షలకుపైగా కాజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు.. నవాబుపేటకు చెందిన విశ్రాంత అధ్యాపకుడు జయరామయ్య 2019లో ఉద్యోగ విరమణ పొందాక వచ్చిన నగదుతో దర్గామిట్టలోని ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్‌లో భార్య పేరుపై పాలసీ చేశారు. కొద్ది రోజుల అనంతరం జయరామయ్య ఇంటికి హనుమంతరావు అనే వ్యక్తి వచ్చారు. తాను ఇన్సురెన్స్ పాలసీ వేసిన బ్రాంచ్‌కు మేనేజర్‌నని పరిచయం చేసుకున్నారు. మీరు కట్టిన పాలసీతో పెద్దగా బెనిఫిట్స్ రావని.. తాను సూచించిన మేరకు డిపాజిట్ చేసుకుంటే అధిక వడ్డీలు వస్తాయని నమ్మబలికారు. ఈ మాటలను నమ్మి పాలసీని జయరామయ్య రద్దు చేసుకున్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయిస్తానని చెప్పడంతో దాదాపు రూ.పది లక్షలను హనుమంతరావు ఖాతాకు బదిలీ చేశారు. బాండ్లను జయరామయ్యకు ఇచ్చారు. ఇటీవల జయరామయ్య ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో డిపాజిట్ చేసిన నగదు అవసరమని హనుమంతరావుకు ఫోన్ చేశారు. అయితే ఫోన్ స్విచ్చాఫ్ రావడంతో దర్గామిట్టలోని బ్రాంచ్‌కు వెళ్లి ఆరాతీయగా, హనుమంతరావు మోసగాడని తేలింది. బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి ఏడాది జైలు

నెల్లూరు(లీగల్): ఫోర్జరీ సంతకంతో లేఖను సృష్టించి నగదును కాజేసిన కేసులో నేరం రుజువు కావడంతో ముత్తుకూరు మండలం నేలటూరుకు చెందిన శ్రీనివాసులురెడ్డి, ఏపీజీబీ శ్రీనివాసాగ్రహారం బ్రాంచ్ మేనేజర్ రామసుబ్బారావుకు ఏడాది జైలుతో పాటు రూ.3.8 లక్షలను ఫిర్యాదికి పరిహారంగా చెల్లించాలని నెల్లూరు ఐదో అదనపు మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి దేవిక బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. రంగనాయకులపేటలోని ఆనకట్ట రోడ్డుకు చెందిన శ్రీధర్ విద్యుత్ ఎస్ఈ కార్యాలయంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. శ్రీనివాసాగ్రహారంలోని ఏపీజీబీలో 2006, జూన్ 23న ఖాతాను ప్రారంభించారు. 2010, మార్చి 13న తన ఖాతా నుంచి రూ.1,38,500 మేర తగ్గిందని గుర్తించి బ్యాంక్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. పరిశీలించి శ్రీనివాసులురెడ్డి ఖాతాలో జమైందని గుర్తించారు. కాగా సదరు మొత్తాన్ని తండ్రి శ్రీనివాసులురెడ్డికి బదిలీ చేయమని లేఖను రాసిచ్చారంటూ మేనేజర్ చూపారు. దీంతో ఫిర్యాది తన తండ్రి పేరు యానాటి శ్రీనివాసులురెడ్డి కాదని.. వైవీ కృష్ణారెడ్డి అని పాస్‌బుక్‌లో ఉన్న అంశాన్ని మేనేజర్‌కు తెలిపారు. వ్యవహారంలో మేనేజర్ పాత్ర ఉందని గ్రహించిన ఫిర్యాది బ్యాంక్ ఉన్నతాధికారులు, బ్యాంకింగ్ అంబుడ్స్‌మెన్‌కు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లభించలేదు. దీంతో శ్రీనివాసులురెడ్డి, రామసుబ్బారావుపై బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్లో 2012 సెప్టెంబర్ 29న ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం ఇద్దరిపై కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పైమేరకు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ప్రకృతికుమార్ కేసు వాదించారు.

ఘనంగా పంచవృత్తుల పతాకావిష్కరణ

నెల్లూరు(బృందావనం): విరాట్‌నగర్‌లోని వీబీఎస్ కల్యాణ మండప ప్రాంగణంలో నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థాన ఎదుట పంచవృత్తుల పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్వామివారికి పూజలు చేశారు. సంఘ శాశ్వత వ్యవస్థాపక అధ్యక్షుడు చెంగయ్య ఆచారి, తదితరులు పర్యవేక్షించారు.

పసుపు కుంకుమతో చంద్రబాబు మోసం

- వైఎస్సార్ ఆసరాతో మాట నిలుపుకొన్న సీఎం వైఎస్ జగన్
- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: 2014 ఎన్నికలకు ముందు పొదుపు రుణమాఫీ హామీతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పసుపు కుంకుమ పథకంతో పొదుపు మహిళలను మోసం చేశాడని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేసి మాట నిలుపుకొన్నాడని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా పెనుబల్లిలో బుధవారం ఆయన పర్యటించారు. మండలంలోని 1035 పొదుపు సంఘాలకు మూడో విడత ఆసరా పథకం కింద మంజూరు చేసిన రూ.9.17 కోట్ల నమూనా చెక్కును అందజేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును పొదుపు మహిళలకు అందజేశారు. అనంతరం గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మోసం చేయడంతో బ్యాంకులకు బకాయిపడి పొదుపు మహిళలు ఆర్థికంగా చితికిపోయారన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జగనన్న వైఎస్సార్ ఆసరా పథకం కింద ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ.19 వేల కోట్లను పొదుపు మహిళల ఖాతాల్లో జమచేశారని వివరించారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి మాట్లాడుతూ జగనన్న మహిళలకు ఇచ్చిన మాట ప్రకారంగా ఇప్పటి వరకు వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడు విడతల నగదును ఖాతాల్లో జమచేశారని తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వైఎస్సార్ సీపీని వీడుతున్నట్లు మీడియాలో వస్తున్న వార్తల్లో నిజంలేదని, నిజానిజాలు తెలుసుకుని రాయాలని హితవు పలికారు.

మైండ్‌గేమ్ ఆడుతున్న చంద్రబాబు

రాబోయే ఎన్నికల్లోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు పట్టం కట్టడం ఖాయమని తెలుసుకున్న చంద్రబాబు మైండ్‌గేమ్‌కు తెరలేపాడని ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తాను ఎప్పటికీ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఉంటానని, మరో పార్టీలోకి వెళ్లాల్సిన అవసరం తనకు లేదన్నారు. తనలోని చివరి రక్తపు బొట్టు వరకు జగన్‌తోనే తాను ప్రయాణిస్తానని స్పష్టం చేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

పెనుబల్లిలో రూ.24 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకేను ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే పెనుబల్లి నుంచి కాగోళ్లపాడు వరకు కోటి రూపాయలతో నిర్మించి తారురోడ్డును ప్రారంభించారు. బుచ్చిరెడ్డిపాళెం, దామరమడుగులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. టీటీడీ ఆధ్వర్యంలో కోవూరు నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సుమారు 29 రామమందిరాలను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఒక్కో ఆలయానికి రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసిన టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, కోవూరు ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, జొన్నవాడ ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, నేతలు సూరా శ్రీనివాసులరెడ్డి, యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, జేటీపీ సుధాకర్‌రాజు, కోవూరు ఏడీఏ సుజాత, సర్పంచ్ ఓడా పెంచలయ్య, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట మండలాల పార్టీ కన్వీనర్లు బెజ్జం సతీష్‌రెడ్డి, మావులూరు శ్రీనివాసులరెడ్డి, నాయకులు నల్లపరెడ్డి రజతీకుమార్‌రెడ్డి, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, ఏపీఎం లలిత, ఎంపీపీ శ్రీనివాసులు, నాయకులు జొన్నవాడ ప్రసాద్, గుమ్మా రఘురామయ్య, దాసరి సుబ్బయ్య, రఫీ, ఎల్లసిరి నారాయణ, కావేటి కృష్ణయ్య, వేణుగోపాల్, హజరత్తయ్య, శ్రీకాంత్‌రెడ్డి, అల్లాభక్షు, కౌన్సిలర్లు షకీలా, చీర్ల ప్రసాద్, సత్యనారాయణ, శివకుమార్‌రెడ్డి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం: సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్యాబోధన



ముత్తుకూరులో పది విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్

ముత్తుకూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన విద్యాబోధన అందిస్తున్నట్లు బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్‌లోని 'హైస్కూల్ ప్లస్' (జూనియర్ కాలేజీ) ప్రిన్సిపల్ డీ సాయిప్రసాద్ తెలిపారు. మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులకు ఇంటర్ విద్యపై బుధవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్‌ను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసి ఇంటర్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరంలో అందిస్తున్న కోర్సుల వివరాలను క్షుణ్ణంగా వివరించారు. ఇంటర్ విద్య కోసం పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, ప్రైవేట్ కళాశాలలకు వేలకు వేలు ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఏర్పాటైన హైస్కూల్ ప్లస్‌లో జూనియర్ ఇంటర్ చేరాలని కోరారు.

చిరుధాన్యాల్లో పోషక విలువలు



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పద్మావతి

కొడవలూరు: చిరుధాన్యాల్లో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయని ఐసీడీఎస్ యల్లాయపాళెం సెక్టార్ సూపర్‌వైజర్ వీ పద్మావతి తెలిపారు. తాటాకులదిన్నె అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల రక్తహీనతను అధిగమించవచ్చన్నారు. అందుబాటు ధరల్లో లభ్యమయ్యే పోషక విలువలు కలిగిన ఆహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. యల్లాయపాళెం వైద్యాధికారిణి ఆరోగ్యజాగ్రత్తలను సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

లేఅవుట్‌లో జగడాలు

ఇందుకూరుపేట: పేదలకు సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న కాలనీ లేఅవుట్లను నిర్మించి ఇళ్ల పట్టాలను, గృహాలను మంజూరు చేయగా, కొందరు స్వార్థపరులు వాటిపై జగడాలను లేవనెత్తుతున్నారు. ప్రభుత్వం నివేశన స్థలాలు లేని పేదలను గుర్తించి జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలు ఇచ్చింది. ఇళ్ల పట్టాల పంపిణీ చేసే సమయంలో ఇంటి స్థలాలను అమ్ముకోవద్దని, మీ బిడ్డలకు ఆస్తిగా అందించాలని ఎమ్మెల్యేలు సైతం పదేపదే సూచనలు ఇచ్చారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మించుకోలేని నిరుపేదలకు ప్రభుత్వం బిల్లు చెల్లించిన తరువాత తిరిగి ఇవ్వాలన్న షరతుతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆర్థిక సాయం అందజేశారు. కాగా కొత్తూరు పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీ లేఅవుట్లో ఓ లబ్ధిదారుడికి స్థానిక నాయకుడు కంకర, సిమెంటు, రాయి వంటివి తీసుకొచ్చి పునాదుల వరకు నిర్మాణం చేశాడు. బిల్లు వచ్చిన తరువాత వచ్చిన సదరు లబ్ధిదారుడు కొంత తగ్గించుకుని మిగిలిన మొత్తాన్ని నాయకుడికి చెల్లించాడు. అనంతరం బేస్‌మెంట్ వరకు కట్టిన ఇంటిని మరొకరికి విక్రయించాడు. ప్రస్తుతం తన నగదును తనకు తిరిగి చెల్లించాలని, మీకు కావాలంటే తన దగ్గర ఇళ్ల స్థలం కొనుగోలు చేసిన వారి దగ్గర తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సదరు నాయకుడిపై జగడానికి దిగుతున్నాడు. స్థానికుల అండతో రగడ చేస్తున్నాడు. ఇళ్ల స్థలాల్లో అమ్మకాల్లో రెవెన్యూ సిబ్బంది మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నివేశన స్థలాల విక్రయంపై అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై గృహనిర్మాణ శాఖ ఈఏ వెంకటేశ్వరరెడ్డిని వివరణ కోరగా నివేశన స్థలాల విక్రయంపై విచారణ చేపడతామన్నారు. అమ్మకాలు, కొనుగోలు వ్యవహారం జరిగితే ఉన్నతాధికారుల సూచనల మేరకు రద్దు చేస్తామని తెలిపారు.

నాణెంపై సీతారాములు



బ్రహ్మదేవి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని డీ హిమశర్వాణి రెండు రూపాయల నాణెంపై సీతారాముల చిత్రాన్ని పంచరంగుల్లో చిత్రీకరించింది. శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ చిత్రాన్ని మనోహరంగా రూపొందించి శుభాకాంక్షలు తెలియజేసింది. – ముత్తుకూరు

సీతారాములకు ప్రణామం



యాచవరానికి చెందిన సూక్ష్మకళాకారుడు అలూరు రాము చెక్కతో సూక్ష్మ సీతారామలక్ష్మణాంజనేయస్వామి ప్రతిమలను రూపొందించాడు. శ్రీరామనవమి సందర్భంగా వాటిని పెన్సిల్‌పై ప్రదర్శించి శ్రీరాముడికి ప్రణమిల్లాడు. – మనుబోలు

నేత్రదానం

కోవూరు (విడవలూరు): విడవలూరుకు చెందిన చిట్టేడి సత్యవతి (75) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మనసేవా సంస్థ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల టెక్నీషియన్లు లాలేష్, బాలాజీలు కార్నియాలను స్వీకరించారు. నేత్ర దానానికి ముందుకొచ్చిన సత్యవతి కుటుంబ సభ్యులకు మనసేవా సంస్థ నిర్వాహకుడు శ్రీనివాసులరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

వెంకటాచలం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజున జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 173 మంది విద్యార్థులకు గానూ 169 మంది హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

శ్రీరామనవమి శుభాకాంక్షలు

కోవూరు: శ్రీరామనవమి సందర్భంగా కోవూరు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామనవమిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, సీతారాముల కల్యాణాన్ని తిలకించి కృపా కటాక్షాలు పొందాలని కోరారు.

మద్యం ధ్వంసం



కోవూరు: కోవూరు సెబ్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన కాలం చెల్లిన మద్యాన్ని బుధవారం ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ నరహరి తెలిపారు. సెబ్ డిప్యూటీ కమిషనర్లు హేమంత్‌నాగరాజు, హిమవతి ఆదేశాలతో 67 కేసుల్లో సీజ్ చేసిన 5,550 బీరు బాటిళ్లు, 1617 మద్యం సీసాలను గుమ్మలదిబ్బ చెరువుకట్ట వద్ద ధ్వంసం చేసినట్లు వివరించారు.

ఉచిత వైద్య శిబిరం



బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరులో నెల్లూరు కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కోటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి సహకారంతో నిర్వహించిన శిబిరంలో దాదాపు డాక్టర్ రమాదేవి 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గాంధీ గిరిజన కాలనీలో కొలువైన రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ధ్వజారోహణను భక్తిశ్రద్ధలతో బుధవారం జరిపారు. ఉభయకర్తలుగా వెంకటరమణ దంపతులు వ్యవహరించారు.

శ్రీరామనవమికి ముస్తాబు



కృష్ణపట్నంలోని కోదండరామస్వామి ఆలయం

ముత్తుకూరు: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా మండలంలోని రామాలయాలను ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలతో మనోహరంగా అలంకరించారు. ముత్తుకూరు, పంటపాళెం, కృష్ణపట్నం, పొట్టెంపాడు, మామిడిపూడి, పిడతాపోలూరు, మునునూరువారిపాళెం, దమ్మాయపాళెం, నారికేళపల్లి గ్రామాల్లోని కోదండరామస్వామి ఆలయాలను నవమి ఉత్సవాలకు సిద్ధం చేశారు. సీతారాముల కల్యాణాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు సీతారాముల కల్యాణం

పొదలకూరు : శ్రీరామ నవమిని పురస్కరించుకుని పట్టణంలోని సాయిబాబా మందిరంలో గురువారం ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ మందిరం సేవా సమితి సొసైటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం కాకడ హారతి, పంచామృతాభిషేకం, పతాక గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

- శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.
- అయ్యప్పనగర్‌లోని శ్రీదేవిభూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సాయంత్రం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ఆలయాల వార్షికోత్సవం



విశేషాలంకారంలో గంగమ్మ



మహాసుదర్శన హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మనుబోలు: కొండూరుసత్రంలోని కోదండరామస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహాసుదర్శన హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే మనుబోలు చెరువు గట్టుపై ఉన్న గంగమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అర్చకులు సుబ్రహ్మణ్యంశర్మ ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం దేవిడ్

మనుబోలు: జాతీయ ఉపకార వేతనం కోసం జాతీయస్థాయిలో నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కంటేపల్లి మౌనిక ప్రతిభ కనబరిచింది. జాతీయస్థాయిలో 88వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా మౌనికను హెచ్‌ఎంలు డేవిడ్, వసంతకుమారి బుధవారం అభినందించారు. అలాగే జాతీయస్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపికైన బాలికోన్నత పాఠశాల విద్యార్థిని లక్ష్మిని అభినందించారు. అనంతరం బాలికల పాఠశాల హెచ్‌ఎం వసంతకుమారి, సైన్స్ ఉపాధ్యాయిని సువర్ణను సన్మానించారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సునీత, కోఆప్షన్ సభ్యుడు అనమాల ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు వైద్యపరీక్షలు



వెంకటాచలం: నెల్లూరుకు చెందిన ఎనెల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వెంకటాచలం, మనుబోలు పోలీస్‌స్టేషన్లలో పని చేస్తున్న సిబ్బందికి బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో షుగర్, బీపీ, ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహించి ఆరోగ్య జాగ్రత్తలను సూచించారు. వైద్యులు నాగేంద్రప్రసాద్, మహేంద్రనాథ్‌రెడ్డి, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు



మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా మారిన పొదలకూరులోని గేటుసెంటర్ ప్రాంతం

పొదలకూరు: రెండ్రోజులుగా ఎండలు మండుతున్నాయి. ఈ ఏడాది ఎండలు గతేడాది కంటే అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో మార్చి చివరి వారంలోనే వేసవి తాపం మొదలైంది. పొదలకూరు ప్రాంతానికి వెలిగొండలు దగ్గరగా ఉండడం, మెట్టప్రాంతం కావడంతో ఎండలు సాధారణం కంటే ఒకటి, రెండు డిగ్రీలు అదనంగా ఉంటున్నాయి. ఉదయం 11.30 గంటల తర్వాత సెగలు పెరుగుతున్నాయి. వేసవి తాపం దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు ఎండలకు బయటకు రావద్దని, అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగులు వేసుకుని వెళ్లాలని చెబుతున్నారు. వడదెబ్బ నుంచి రక్షణకు మంచినీటిని అధికంగా సేవించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను కలుపుకుని తాగాలని సూచిస్తున్నారు.

గుండెపోటుతో ద్విచక్ర వాహనచోదకుడి మృతి



బుచ్చిరెడ్డిపాళెం: ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అదుపుతప్పి రాళ్ల గుట్టపై పడడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పెనుబల్లి శివారులోని రైస్‌మిల్లు వద్ద బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. బుచ్చిరెడ్డిపాళెనికి చెందిన వాల్మీకి శ్రీనివాసులరెడ్డి (60) సమీప బంధువు అంత్యక్రియలకు మోటార్‌సైకిల్‌పై పెనుబల్లికి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. రైస్‌మిల్ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా గుండెపోటు రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న రాళ్లగుట్టపై పడడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో శ్రీనివాసులరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

వేడుకగా పుత్రకామేష్టి యాగం





నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని అనంత కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ప్రారంభ సందర్భంగా పుత్రకామేష్టి యాగాన్ని మాచవోలు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి 180 మందికిపైగా దంపతులు హాజరయ్యారు. పలు ఆలయాల నుంచి దేవదేవేరులు తరలివచ్చారు. ఉభయకర్తలుగా కరుణమ్మ, వెంకటేశ్వర్లుగుప్తా, గీతాంజలి, సురేంద్రనాథ్ గుప్తా, అన్నపూర్ణ దంపతులు, భారతి, విష్ణుతేజ, చిన్మయి వ్యవహరించారు. నిర్వాహకులు మోహన్‌రావు, కిషోర్‌కుమార్, వెంకటరత్నం, మస్తాన్‌రావు, సత్యం, పూర్ణచంద్రరావు, సుకుమార్, ఆంజనేయులు, తదితరులు పర్యవేక్షించారు.